



భూముల రీసర్వే గురించి రైతులు, అధికారులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ చేతన్

రైతుల సమక్షంలోనే రీసర్వే

దీనిపై అవగాహన కల్పించాలి : కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేను సంబంధిత రైతుల సమక్షంలోనే నిర్వహించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని పోతులనాగేపల్లి గ్రామంలో జరుగుతున్న రీసర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు కుటుంబ సభ్యుల సమక్షంలో రీ సర్వే చేయడం ద్వారా భవిష్యత్తులో ఎటువంటి సమస్యలూ తలెత్తవన్నారు.

ఈవీఎం గోడౌన్లు తనిఖీ

ధర్మవరం మార్కెట్ యార్డులో ఉన్న ఈవీఎం గోడౌన్లను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. గోడౌన్ వద్ద సీసీ కెమెరా వ్యవస్థ, ఫైర్ సేఫ్టీ, 24 గంటల భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

ఆర్టీసీ బస్టాండ్ పరిశీలన

ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్ పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, ప్రయాణికులకు ఏర్పాటు చేసిన టికెట్ కౌంటర్లు, సైకిల్ స్టాండ్, మరుగుదొడ్ల నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించారు. బస్టాండ్‌ను మరింత శుభ్రంగా ఉంచాలని ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. వృద్ధులు, మహిళలు, శారీరకంగా వైకల్యం ఉన్నవారికి ప్రత్యేకంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో మహేష్, తహశీల్దార్ సురేష్ బాబు, ఆర్టీసీ డిపో ఇన్‌ఛార్జి సికిందర్, సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలకు బాసటెవరు..!

◆ మార్గదర్శకులవ్వాలని అధికారులపై ఒత్తిడి ◆ బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల మధ్య కుదరని లంకె



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్రంలో పేదరికం లేకుండా చేస్తానంటూ ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు పి4 పేరుతో కార్యచరణను రూపొందించింది. సర్వే పేరుతో అత్యంత పేదరికంలోనున్న కుటుంబాలను గుర్తించింది. ఆ కుటుంబాలకు 'బంగారు కుంటుంబాలు' అని నామకరణం కూడా చేసింది. దీనికి ప్రభుత్వపరంగా అందించే సహాయం కంటే సంపద కలిగున్న వారు బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని వారికి అవసరమైన ఆర్థిక, ఇతర తోడ్పాటును అందించి పేదరికం నుంచి గట్టెక్కించాలన్నది ప్రభుత్వం లక్ష్యం. ఆచరణలో చూసినప్పుడు బంగారు కుటుంబాలకు దత్తత తీసుకునే మనసున్న మారాజులు ఇప్పుడు కనిపించడం లేదు. దీంతో బంగారు కుటుంబాలు ఎప్పటిలాగానే దిక్కులేని కుటుంబాలుగానే ఉంటున్నాయి.

అనంత జిల్లాలో 26 శాతమే దత్తత

అనంతపురం జిల్లాలో 68,381 బంగారు కుటుంబాలున్నట్టు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. 2,02,492 మంది ఈ కుటుంబాల పరిధిలోనున్నారు. ఇందులో ఇప్పటి వరకు దత్తత తీసుకున్న కుటుంబాలు చూస్తే 18,397 కుటుంబాలున్నాయి. 49,984 మందిని దత్తత తీసుకున్నారు. ఇప్పటి వరకు దత్తత తీసుకున్న మార్గదర్శకులు ఎంతమంది అని చూస్తే 2744 మంది ఉన్నారు. ఈ లెక్కల్లోనూ తప్పులున్నట్టు అధికారులు భావిస్తున్నారు. బంగారు కుటుంబాల మార్గదర్శకులుగా నమోదు చేసే సమయంలో తప్పిదాలు జరిగి ఈ సంఖ్య ఎక్కువగా నమోదయినట్టుగానూ తెలుస్తోంది. ఈ లెక్క ప్రకారం చూసుకున్నా ఇప్పటి వరకు 26 శాతం కుటుంబాలకే మార్గదర్శకులు ముందుకొచ్చారు.

అధికారులే ఎక్కువ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఈ కార్యచరణ అమలు బాధ్యత ఎక్కువగా అధికారులపైనే పడుతోంది. అధికారులకు ప్రత్యేకంగా ఉన్నతాధికారులు లక్ష్యాలు కూడా పెట్టారు. ఒక్కో అధికారి, ఉద్యోగి బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని చెప్పడంతో విధిలేని పరిస్థితుల్లో పేర్లు నమోదు చేసుకున్నారు. అక్కడక్కడా అధికార పార్టీ నేతలు కూడా కొంత మంది మార్గదర్శకులుగా పేర్లు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ పనుల కోసం వెలుతున్న వారిపైనా కూడా మార్గదర్శకులవ్వాలన్న ఒత్తిడిని అధికారులు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇష్టపూర్వకంగా చేయాల్సిన పనిని బలవంతంగా చేయించడం ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

మార్గదర్శకులు, బంగారు కుటుంబాల మధ్య కుదరని లంకె

బంగారు కుటుంబాల దత్తత విషయంలో ఉన్నత స్థాయి నుంచి ఒత్తిళ్లు రావడంతో పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంలో బంగారు కుటుంబాలకు ఏమి అవసరమో కూడా పరిశీలించకుండా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. మార్గదర్శకుల ద్వారా తమకు ఏ మేరకు తోడ్పాటు లభిస్తుందో అన్నది కూడా బంగారు కుటుంబాకు



తెలియడం లేదు. ఎవరికి వారు అన్నట్టుగా రికార్డుల్లో మాత్రమే నమోదయి ఉన్నాయి. బంగారు కుటుంబాల అవసరాలేమిటో కూడా మార్గదర్శకులకు తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పి-4 బంగారు కుటుంబాల అంశం ఏ మేరకు ముందుకు సాగుతున్నది ప్రశ్నార్థకంగానే మారింది.

ఈ నెలా కందిపప్పు లేనట్టే..!

బియ్యం, చెక్కరతో సరి

ప్రజాశక్తి-పెనుకొండ



పెరిగిన ధరల నేపథ్యంలో పేద,మధ్య తరగతి ఇళ్లలో కందిపప్పు తినాలంటే గగనమైపోయింది. ప్రభుత్వ చౌక దుకాణాల ద్వారా కందిపప్పును ప్రభుత్వం అందించాల్సి ఉన్నా అది అమలుకు నోచుకోవడం లేదు. గత ఐదారు నెలలుగా ప్రతినెలా రేషన్ దుకాణాల్లో కేవలం బియ్యం, చెక్కర మాత్రమే పంపిణీ చేస్తున్నారు. ఈ నెల కూడా రేషన్ షాపులకు కందిపప్పు రాలేదు. ఈ ఏడాది మార్చి నుంచి రేషన్‌షాపులకు కందిపప్పు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. శ్రీసత్యసాయి జిల్లాలో మొత్తం 5,76,632 రేషన్ కార్డులు, 1,367 చౌక దుకాణాలున్నాయి. ప్రతి నెలా 8,600 మెట్రిక్ టన్నుల బియ్యం, చక్కెర 430, కందిపప్పు 576 పంపిణీ చేయాల్సి ఉంది. బియ్యం చెక్కరను ఇస్తున్నా కందిపప్పు ఇవ్వడం లేదు. బహిరంగ మార్కెట్‌లో రూ.120నుంచి రూ.140 వరకు ధర పలుకుతోంది. చౌక డిపోల ద్వారా సరఫరా చేస్తే పేదలకు కిలో రూ.67కే వస్తుంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం దీనిపై స్పందించి అన్ని చౌక డిపోల ద్వారా కందిపప్పును సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని పేదలు కోరుతున్నారు.

'తప్పు చేయకున్నా ఒప్పుకోమన్నారు'..!

◆ దొంగతనం, హత్యాయత్నం కేసు.. యువకుడు ఆత్మహత్య

◆ కావాలనే ఇరికించారంటూ సెల్ఫీవీడియో

◆ మృతుని కుటుంబ సభ్యుల ఆందోళన

ప్రజాశక్తి-తలుపుల

దొంగతనం, హత్యాయత్నంకు పాల్పడుకున్నా, తానే చేసినట్లు ఒప్పుకోమని అకారణంగా నింద మోపారని ఆరోపిస్తూ ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో తీసుకుని తన ఆవేదన వ్యక్తం చేశాడు. అకారణంగా తనను కొట్టడంతో మనస్తాపానికి లోనై ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు అందులో తెలియజేశారు. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం పులిగుండ్లపల్లి పంచాయతీ రాజనాలపల్లి గ్రామంలో చోటు చేసుకున్న ఈఘటన ఉద్రిక్తతలకు దారి తీసింది. ఇందుకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...

తలుపుల మండలం పులిగుండ్లపల్లి పంచాయతీకి సర్పంచిగా వైసిపి మద్దతుదారురాలు సుగుణమ్మ వ్యవహరిస్తున్నారు. ఈమెది ఈ పంచాయతీ పరిధిలోని రాజనాలపల్లి గ్రామం. ఇదే గ్రామానికి చెందిన నవీన్(24) టిడిపి సానుభూతిపరునిగా ఉన్నారు. సోమవారం రాత్రి సర్పంచి తన ఇంటి వద్ద ఉండగా నవీన్ అటుగా వెళ్లాడు. ఈ సమయంలో తనపై దాడి చేసి తన మెడలోని బంగారు గొలుసును నవీన్ ఎత్తుకెళ్తున్నాడంటూ సర్పంచి కేకలువేసింది. దీంతో అక్కడున్న వారు నవీన్‌ను పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గ్రామానికి చేరుకుని నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. తనకేమీ సంబంధం లేదని చెప్పడంతో పోలీసులు మంగళవారం నాడు విచారిద్దామంటూ స్టేషన్ నుంచి బయటకు పంపారు.



మృతుడు నవీన్ (ఫైల్‌ఫొటో)

సెల్ఫీ వీడియో.. ఆత్మహత్య..

చోరీ, హత్యాయత్నం ఆరోపణలు ఎదుర్కొంటున్న నవీన్‌కుమార్ శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బహిర్భూమికి ఊరి బయటకు వెళ్లాడు. ఇదే సమయంలో ఓ సెల్ఫీవీడియో విడుదల చేశాడు. అకారణంగా తనపై దొంగతనం కేసు వేయడంతో పాటు, తనను కొట్టారని, తన వద్ద బంగారు గొలుసు లేదని చెబుతున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. పోలీసులు కూడా నేరం చేసినట్లు ఒప్పుకోవాలని ఒత్తిడి చేశారంటూ సెల్ఫీవీడియోలో తెలియజేశారు. అనంతరం అక్కడే చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన గ్రామస్తులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

కుటుంబ సభ్యుల ఆందోళన

తమ కుమారుడి ఆత్మహత్యకు సర్పంచి కుటుంబ సభ్యులే కారణం అంటూ నవీన్ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. సర్పంచి ఇంటి వద్ద బైటాయించి నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయాలంటూ పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. చట్టప్రకారం న్యాయం చేస్తామని ఎస్ఐ కె.నరసింహుడు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి తరలించారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



సర్పంచి ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న మృతుని కుటుంబసభ్యులు, తదితరులు

సొసైటీ అధ్యక్షులుగా శివారెడ్డి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు



సొసైటీ అధ్యక్షుడిని అభినందిస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి

మండల పరిధిలోని అల్లాపల్లి ప్రాథమిక సహకార సొసైటీ అధ్యక్షులుగా ఎన్నికైన బొల్లం శివారెడ్డి మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి , ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి హాజరయ్యారు. అల్లాపల్లి సొసైటీ సీఈవో రామాంజనేయులు, ఓడి చెరువు ఏ డి సి సి బ్యాంకు వెంకట చలపతి శివారెడ్డిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం, అభివృద్ధికి కోసం పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓడి చెరువు ప్రాథమిక సహకార సొసైటీ అధ్యక్షులు తుమ్మల మహబూబ్ బాషా, రాష్ట్ర డైరెక్టర్ కాలే నాయక్ , టిడిపి మండల కన్వీనర్ శెట్టి వారి జయ చంద్ర, మాజీ జడ్పిటిసి పిట్ట ఓబుల్ రెడ్డి, మండల మాజీ కన్వీనర్ రాజారెడ్డి ,జయమ్మ , జాకీర్, జెరిపిటి అంజినప్ప ,నిజాం, ఓబుల్ రెడ్డి, సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు భూ సేకరణ ఆపాలి



ధర్నాలో పాల్గొన్న గ్రామస్తులు, నాయకులు

2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా.

తనను మోసం చేశారని విఆర్ఒపై ఫిర్యాదు చేసిన దళిత మహిళా సర్పంచి

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని తుంగోడు రెవెన్యూ పొలం సర్వే నంబర్ 28 నందు బలవంతపు భూసేకరణ ఆపాలని, 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తుంగోడు , కొలిమిపల్లి , కావేటి నాగేపల్లి , చిన్న బాబయ్య పల్లి , కూకట్ మానిపల్లి , వెలగ మేకల పల్లి గ్రామాలకు చెందిన సాగుదారులు గ్రామ సర్పంచి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వీరి ధర్నాకు సిపిఎం మండల కమిటీ సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలోని తుంగోడు రెవెన్యూ పొలం సర్వే నంబర్ 28లో ఆయా గ్రామాలకు చెందిన భూమిలేని పేద దళిత , బడుగు బలహీన వర్గాల కుటుంబాలు సుమారు 300 మంది ఒక్కొక్క కుటుంబం 5 ఎకరాల లోపు సాగు అనుభవంలో ఉన్నాయన్నారు. వీరందరూ ఉలవలు , వేరుశనగ , కంది , ఆముదం వంటి పంటలు పండిస్తు కుటుంబాలను పోషించుకుంటున్నారని చెప్పారు. తమకు అసైన్మెంట్ హక్కులు కల్పించాలని గతంలో విజ్ఞప్తులు , నిరసనలు చేశారన్నారు. ఫలితంగా వీరి సాగు హద్దులను గుర్తిస్తూ గత ప్రభుత్వాలు అసైన్మెంట్ ప్రతిపాదనల కోసం సర్వే, సబ్ డివిజన్ చేసి సాగుదారులను గుర్తించి 8వ విడత భూ పంపిణీకి ప్రతిపాదనలు సిద్ధం చేశాయని చెప్పారు. ప్రస్తుతం రెవిన్యూ సిబ్బంది ముందస్తు సమాచారం ఇవ్వకుండా సాగు దారులను , గ్రామాల ప్రజలను భయబ్రాంతులకు గురి చేసి అక్రమంగా , దౌర్జన్యంగా జెసిబి యంత్రాలతో భూముల్లోకి ప్రవేశించి బలవంతపు భూసేకరణ కు పాల్పడడం దుర్మార్గమన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇన్‌ఛార్జి తహశీల్దార్ మారుతికి సమర్పించారు. అదేవిధంగా గ్రామ దళిత సర్పంచి గంగమ్మ వీఆర్వోలు లోకేష్, అంజినప్పపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెల్ టవర్లు కోసం సంతకాలు చేయాలని ఇంటి దగ్గరకు వచ్చి సంతకాలు చేయించుకొని చదువు రాని తనను మోసం చేశారని చట్ట బద్ధంగా శాఖా పరమైన చర్యలతో పాటు వీరిద్దరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని స్థానిక ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు హనుమయ్య, నాగభూషణ , రామకృష్ణ , తుంగోడు మాజీ సర్పంచి నారాయణ రెడ్డి, సాగుదారులు రత్నమ్మ , సురేష్ , అంజినప్ప , అంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవనిమంత్రి సవిత మున్సిపాలిటీ అధికారులను హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణ పరిధిలో నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం అందించే సేవలను తెలియజేయాల్సిన బాధ్యత ఉద్యోగులకుందన్నారు. ప్రజలు సమస్యలపై కార్యాలయానికి వస్తే ఉద్యోగులు పట్టించుకోవడం లేదనే ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయన్నారు. ఎవరికైనా పనిచేయడం ఇష్టం లేకపోతే విధుల నుంచి తప్పుకోవాలని ప్రజా సమస్యలు పట్టించుకోకుండా, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్ కుమార్, ఎంపిడిఒ నరేష్‌కృష్ణ, కమిషనర్ సతీష్ కుమార్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్ల జగన్ పాలనలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం

బుక్కపట్నం : ఐదు సంవత్సరాల జగన్ పాలనలో విద్యా వ్యవస్థ, నిర్వీర్యం అయిందనిబీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీసీ సంక్షేమ శాఖ వసతిగృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల కాలంలో జగన్ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారని, టిడిపి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోపే బీసీ హాస్టల్స్, విద్యా వ్యవస్థను నారా లోకేష్ నేతతంలో కార్పొరేట్ కళాశాలకు ధీటుగా తీర్చిదిద్దారని తెలిపారు. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కోరారు. అనంతరం నూతన హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు రాజేంద్ర కుమార్ రెడ్డి, గంగాధర్, ఎంఇఒ గోపాల్ నాయక్, మండల కన్వీనర్ మల్లిరెడ్డి, సత్య సాయి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, పెద్దరాసు సుబ్రహ్మణ్యం, నాయకులు మాజీ సర్పంచి సాకే యశోద, గంగాధర్, వెంకటరాముడు, మాజీ ఎంపీపీ బాలు, జెండాల రామాంజి, లావణ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

ఐటిఐ విద్యార్థుల ఆందోళన

గోరంట్ల : పట్టణంలో వెంకట సాయి ఐటిఐ కళాశాల విద్యార్థులు ప్రభుత్వం మంజూరు చేసిన స్కాలర్షిప్ నగదును తమకు ఇవ్వాలని కళాశాల ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ వెంకట సాయి ఐటిఐ లో చదువుతున్న తాము కళాశాలకు చెల్లించాల్సిన ఫీజు మొత్తం చెల్లించామన్నారు. అయితే ప్రభుత్వం మంజూరు చేసిన స్కాలర్షిప్ నగదు ప్రిన్సిపల్ అకౌంట్ లోకి జమ అయిందన్నారు. ఆనగదును విద్యార్థులకు నగదు ఇవ్వకుండా ప్రభుత్వం ఇంకా స్కాలర్షిప్ మంజూరు చేయలేదని ప్రిన్సిపల్ శివన్న నాయక్ జాప్యం చేస్తున్నారన్నారు.కళాశాలలో సుమారు 40 మందికి స్కాలర్షిప్ మంజూరు అయిందన్నారు. తమకు న్యాయం జరగకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

'పురం'అవినీతిపై లోకాయుక్తలో ఫిర్యాదు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో గత మున్సిపల్ కమిషనర్లు ప్రమోద్ కుమార్, సంఘం శ్రీనివాసులుతోపాటు జూనియర్ అకౌంటెంట్ మనోహర్‌పై మంగళవారం లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు న్యాయవాది గోవిందరాజులు ప్రజాశక్తికి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూపురం పురపాలక సంఘంలో నిధులు ఖర్చు చేసే విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించకుండా, ప్రీ ఆడిట్ ఆమోదం లేకుండా కమిషనర్లు, అకౌంటెంట్ కలిసి తమకు అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్ల నుంచి 20 నుంచి 30 శాతంకమిషన్ తీసుకొని దాదాపు రెండు కోట్ల రూపాయల మేర చెక్కులను అందించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. పురపాలక సంఘంలో పూడికతీత పనుల పేరుతో డివిజన్ కు రూ. 20 లక్షలు కేటాయిస్తూ టెండర్లు పిలిచారనిఈ పనులకు ఇద్దరు కాంట్రాక్టర్లు పోటీపడినప్పటికీ పుట్టపర్తి కి చెందిన కాంట్రాక్టర్ సత్యంను భయబ్రాంతులకు గురిచేసి తప్పుకునే విధంగా చేశారనానరు. కౌన్సిల్ ఆమోదం లేకుండా మరోసారి టెండర్లకు పిలిచి, టెండర్లో అక్రమాలకు పాల్పడి పనులను వైసీ ప్రభాకర్ అనే కాంట్రాక్టర్‌కు నిబంధనలకు విరుద్ధంగా అంచనా మొత్తం కంటే 4.90 శాతంతో పనులు అప్పగించారని చెప్పారు. పురపాలక సంఘంలో కోట్ల రూపాయల విలువైన మున్సిపల్ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయన్నారు. పత్రికల్లో వచ్చిన క్లిప్పింగ్ లతో పాటు అన్ని ఆధారాలతో లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అవినీతికి పాల్పడిన అధికారులపై అవినీతి నిరోధక చట్టం 1988 క్రింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరినట్లు గోవిందరాజులు తెలిపారు.

సమాజంపై బాధ్యతగా వ్యవహరించాలి

అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

సమాజం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. మంగళవారం హిందూపురం రూరల్ మండల పరిధిలోని పూలకుంట ఐసిడిఎస్ కార్యాలయంలో మానవ అక్రమ రవాణాపై సిడిపిఒ వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నపిల్లలను అక్రమ రవాణా చేసి వివిధ రకాల వ్యాపకాలకు వాడుకుంటున్నారని పేర్కొన్నారు. దీనివల్ల అనేక విధాలుగా సమాజానికి విఘాతం చోటు చేసుకుంటుందని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం కూడా మానవ అక్రమ రవాణాకు ఒక కారణంగా చెప్పారు. పిల్లల ప్రవర్తన పై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు. మహిళలు వీటి పట్ల అవగాహన పెంచుకుని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదులు కళావతి, సంతోషికుమారి, రవిచంద్ర, మురళి తో పాటు అంగన్వాడి సూపర్ వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచనలు మేరకు అదునులో పంటలు సాగు చేయాలని వ్యవసాయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ వాణి తెలిపారు. పుట్టపర్తి మండల పరిధిలోని బీడుపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఆనంద్ అనే రైతుకు చెందిన వేరుశనగ పంటను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి లక్ష్మి , రైతులు బీడుపల్లి జయప్ప తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట: మండలకేంద్రంలో ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎడిఎ సనావుల్లా మాట్లాడుతూ పంటసాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. అనంతరం బదిలీపై వెళ్లిన సచివాలయ సిబ్బందిని ఎడిఎతో పాటు తహశీల్దార్ దేవేంద్ర నాయక్, ఎంపీడీవో పార్థసారథి, మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్ రెడ్డి సన్మానించారు.

ఎస్ఐకు సన్మానం

ప్రజాశక్తి - గాండ్లపెంట

గాండ్లపెంట ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌ను టిడిపి స్థానిక నాయకులు మంగళవారం సన్మానించారు. ఈసందర్భ:గా నాయకులు మాట్లాడుతూ ఎస్ ఐ లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అనంతరం మండలంలోని పరిస్థితులను ఎస్ఐ దృషికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డి నాయక్ సూర్యనారాయణ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండలంలోనీ గౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నల్లమాడ సిఐ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలవివాహాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ , శక్తి యాప్, ప్రస్తుతం కాలంలో జరుగుతున్నటువంటి సైబర్ నేరాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు విజయమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు, ఆదర్శ పూర్వ విద్యార్థి మల్లెల రమేష్ , పాఠశాల కమిటీ చైర్మన్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపల్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ క్రాంతి కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చైర్మన్ ఓబులపతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు. జరిగిన జరగనున్న అభివృద్ధి పనులపై కౌన్సిల్ లో చర్చించడం జరుగుతుందన్నారు.

మడకశిర టౌన్ : మడకశిర నగర పంచాయతీ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నగర పంచాయతీ కార్యాలయం లో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ జగన్నాథం తెలిపారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు హాజరుకానునట్లు తెలిపారు ప్రధానంగా పట్టణంలో వీధి దీపాల ఏర్పాటు, సిసి రోడ్ల నిర్మాణం, మురుగుకాలువల నిర్మాణం తదితర అంశాలపై సమావేశం నిర్వహించనున్నారు.

కమతంపల్లిలో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని మద్ది వారి గొంది పంచాయతీలోని కమతంపల్లిలో కేంద్ర బృందం మంగళవారం పర్యటించింది. ఉపాధి హామీ పనుల్లో భాగంగా పూడిక తీత పనులు, శ్మశానవాటిక ప్రహరీ, సిసిరోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, ఏపీవో చంద్రశేఖర్. ఈసీ ఆనంద్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండలంలోని జగరాజుపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలపై ఉపాధ్యాయులను మంగళవారం సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు వెంకట శివారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బదిలీపై వెళుతున్న ఈశ్వర్ నారాయణరెడ్డి ,మనోహర్, ఉమాదేవి, వినోద్బాబు, భక్తవత్సలం, బాబు లను పాఠశాల సిబ్బంది విద్యార్థులు, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జగరాజుపల్లి పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పని గంటలు పెంచొద్దు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

కార్మికులకు పనిగంటలు పెంచొద్దని ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుల డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మంగళవారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ కి వినతిపత్రం అందజేశారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతరం ఆసంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ధర్మవరం మున్సిపాలిటీ ఇంజనీరింగ్ సెక్షన్ ఔట్సోర్సింగ్ కార్మికులు గత 25 సంవత్సరాల నుండి ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. అయితే కార్మికుల సంఖ్య తక్కువగా ఉన్నందున కొద్ది రోజుల నుండి అధికారులు కార్మికులపై పనిభారాన్ని పెంచుతూ 8 గంటల నుండి 12 గంటల మార్పు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక్క ధర్మవరం మున్సిపాలిటీ లోనే 12 గంటలు పని విధానం అమలు చేస్తున్నారన్నారు. ఈవిషయంపై కమిషనర్ స్పందిస్తూ ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు పరుస్తామనిహామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయూబ్ ఖాన్, అనంతపురం జిల్లా నాయకులు మల్లికార్జున, గణేష్, రమణ, బొగ్గు నాగరాజు, సాకే బాబు, అనిల్, లక్ష్మి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎరువుల కొరతలేదు : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఎరువుల కొరతలేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జులై నెల ప్రారంభానికి యూరియా స్టాకు 9508 టన్నులు ఉండగా ఇప్పటివరకు అదనంగా 2880 టన్నులు యూరియా వచ్చిందన్నారు. ఇందులో 6668 టన్నులు విక్రయించగా 3758 టన్నులు యూరియా మిగిలి ఉందన్నారు. ఈ ఎరువులు రైతు సేవా కేంద్రాల వద్ద, వ్యాపారుల వద్ద ఉన్నాయన్నారు. అలాగే డిఎపి 2090 టన్నులు నిల్వ ఉందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 52 వేల హెక్టార్లలో సాగు జరిగిందన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులలో మొక్కజొన్న, కంది, ఆముదం వంటి పంటల సాగుకు అనుకూలంగా వాతావరణం ఉందన్నారు. పంటల సాగు నమోదు అయిన మండలాలకు యూరియా సహా ఇతర ఎరువులు సరఫరా చేస్తామని కలెక్టర్ వివరించారు.

కొత్తగా 4509 వితంతు పింఛన్లు మంజూరు

జిల్లాలో కొత్తగా 4509 వితంతు పింఛన్లు అయ్యాయని వాటిని ఆగస్టు ఒకటిన పంపిణీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. కుటుంబ యజమాని పింఛన్ పొందుతూ మృతి చెందగా, ఆ పింఛను ఆయన భార్యకు చెందే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కొత్తగా మంజూరు అయిన పింఛన్లు కలిపి ఆగస్టు ఒకటిన 2,64,665 మందికి రూ. 115,68,19,500లు జిల్లాలో పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిపోయిన పింఛన్లు 2వ తేదీ పంపిణీ జరుగుతుందన్నారు.

మున్సిపల్ కార్మికులపై లాఠీఛార్జి అమానుషం



కళ్లకు నల్ల రిబ్బను కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

నెల్లూరులో మున్సిపల్ కార్మికులపై జరిపిన లాఠీ చార్జీని ప్రతి ఒక్కరు ఖండించాల్సిన అవసరం ఉందని సిఐటియు పట్టణ కన్వీనర్ రాము, అంగనవాడి జిల్లా కార్యదర్శి శ్రీదేవి అన్నారు. నెల్లూరు సిఐ శ్రీనివాసులు తీరును వ్యతిరేఖిస్తు, నెల్లూరు కార్పోరేషన్‌లో వర్క్ ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమెండ్ చేస్తు మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పారిశుధ్య కార్మికులు కళ్లకు నల్ల రిబ్బను కట్టుకుని ఇందిరా పార్కు నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, సర్కిల్ నిరసన వ్యక్తం చేస్తూ సిఐకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదాలు చేశారు. కార్మికులపై పోలీసు నిర్భంధాన్ని ప్రయోగించి బలవంతంగా అమలకు ప్రయత్నిస్తే రాష్ట్రం అంతా పోరాటానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఇంజనీరింగ్ కార్మికులు మెరుపు నిరసన ధర్నా కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పి జగదీష్, కోశాధికారి ఆనంద్, ఉపాధ్యక్షులు డి రామచంద్ర, మహిళా నాయకులు కవితమ్మ, వెంకట లక్ష్మమ్మ, ఈశ్వరమ్మతో పాటు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

అధిక వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోండి

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

కాల్ మనీ గ్యాంగులపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పోలీసు అధికారులకి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ధర్మవరం పట్టణంలో పాల్గొన్న మీ సమస్య- మా బాధ్యత కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇటీవల కాల్ మనీ గ్యాంగ్ దాడికి గురైన పట్టణంలోని శాంతినగర్ కు చెందిన రమణ కుటుంబాన్ని పరామర్శించారు. గతంలో కూడా ఇలానే దాడులు జరిగాయని రమణతోపాటు ఆయన భార్య భారతి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు ఉన్నారు.. మహిళలు ఉన్నారని చూడకుండా దాడి చేశారని వాపోయారు. అయితే ఇలాంటి వేధింపులపై ముందే ఫిర్యాదు చేసి ఉంటే బాగుండేదని శ్రీరామ్ అన్నారు. ధర్మవరంలో కాల్ మనీ గ్యాంగుల బాధితులు ఎవరైనా ఉంటే... ధైర్యంగా ముందుకు రావాలని శ్రీరామ్ పిలుపునిచ్చారు. ఇలాంటివారు ఏ పార్టీలో ఉన్నా సరే ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. ఈ విషయంలో తెలుగుదేశం పార్టీ బాధితుల పక్షాన అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఎవరు ఇలాంటి ప్రైవేట్ అప్పుల జోలికి వెళ్ళవద్దని... వారి వేధింపులు తట్టుకోలేక క్షణికావేశంతో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పోలీసుల ద్వారా వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని శ్రీరామ్ అన్నారు.

వీర జవాన్ తల్లిదండ్రులకు పరామర్శ

ప్రజాశక్తి - గోరంట్ల

అపరేషన్ సింధూర్‌లో అసువులు బాసిన వీరజవాన్ మురళి నాయక్ తల్లిదండ్రులైన శ్రీరామనాయక్, నాయక్ జ్యోతిబాయ్‌ని పట్టణంలో శ్రీ చైతన్య పాఠశాల ఎజిఎం సుబ్బారెడ్డి మంగళవారం పరామర్శించారు. గోరంట్లలో శ్రీ చైతన్య పాఠశాలలో శంకర్ నాయక్ జ్యోతి బాయ్ కుమార్తె వైష్ణవి బాయ్ ఆరవ తరగతి చదువుతోంది ఈ సందర్భంగా ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి వైష్ణవికి తమ పాఠశాల తరపున సహాయ సహకారాలు అంది స్తామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మోహన్ రెడ్డి, ఏవో నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వీరజవాన్ కుటుంబసభ్యులతో పాఠశాల ఎజిఎం, సిబ్బంది

మహిళను వేధించిన వారిపై చర్యలు తీసుకోండి : వైసిపి



అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ప్రభుత్వ అసుపత్రిలో పారిశుధ్య కార్మికురాలిగ విధులు నిర్వహిస్తున్న మైనార్టీ మహిళను వేదించిన టిడిపి నాయకులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని వైసిపి నియోజక వర్గ సమన్వయ కర్త దీపికా వేణురెడ్డి డిమాండ్ చేశారు. మహిళలపై టిడిపి దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ వైసిపి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టి అంబేద్కర్ సర్కిల్‌లో రోడ్డుపై బైటాయించారు. బాధిత మహిళకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సీఐ తన తీరును మార్చుకుని న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చిన వారికి న్యాయం చేయాలని, టిడిపి కార్యకర్తలా వ్యవహరిస్తే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మధుమతి రెడ్డి, జిల్లా నాయకురాలు కవిత రెడ్డి, రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా, నియోజకవర్గ అనుబంధ విభాగ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మండల కన్వీనర్లు, సీనియర్ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మహాసభల నేపథ్యంలో మంగళవారం జిల్లా కార్యదర్శి శ్రీదేవి, సిఐటియు పట్టణ కన్వీనర్ విఆర్ రాము ఆధ్వర్యంలో అంగన్వాడీ నూతన కార్యవర్గాన్ని పూలకుంట వద్ద ఉన్న ప్రాజెక్టు కార్యాలయంలో ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షురాలిగా అరుణ, ప్రధాన కార్యదర్శిగా శోభమ్మ, కోశాధికారిగా శశికళతో పాటు కమిటీ మెంబర్లుగా 26 మందితో పాటు మూడు మండలాలకు సంబంధించి సెక్టార్ నాయకులను ఎన్నుకున్నట్లు శ్రీదేవి వివరించారు. యూనియన్ మహాసభలు త్వరలో జరుగుతాయన్నారు. అందరూ కలిసి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి

అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు ఇవ్వాలి

రైతుసంఘం జిల్లా అధ్యక్షులు హరి

ప్రజాశక్తి - రొద్దం

అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వమే రైతులకు 20వేల రూపాయలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, జిల్లా కమిటీ మెంబెర్ ఫకృద్దీన్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కళ్లకుంట గ్రామంలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సవితను కలిసిన నాయకులు తమ డిమాండ్లను వినిపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖిభవ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర పీఎం కిసాన్ తో కలిపి ఇవ్వటం రైతులను మోసం చేయడమేనని అన్నారు. అదే విదంగా సోలార్ కోసం బలవంతపు సేకరణ ఆపాలన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల విషయంలో మాటమార్చడం దుర్మార్గమన్నారు. హంద్రీనీవా ద్వారా జిల్లాలోని అన్ని చెరువులను నీటితో నింపాలన్నారు.



సమస్యను మంత్రికి వివరిస్తున్న నాయకులు హరి

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నాయకులు, గ్రామస్తులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి - రొద్దం

ప్రజాసంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని మంత్రి సవిత పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నల్లూరు పంచాయతీ కల్లుకుంట గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న పలు సమస్యలు మండల నాయకులు, గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో దళితులు ఎక్కువగా ఉన్న కంబాలపల్లి, నల్లూరు, చిన్నమంతూరు తదితర గ్రామాలలో శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు నాగరాజు కోరారు. కార్యక్రమం అనంతరం అధికారులతో, మండల నాయకులతో ఆమె అక్కడే సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మాధవ నాయుడు, కన్వీనర్ నరహరి, చిన్నప్పయ్య, చంద్రమౌళి, వెంకట్రాంరెడ్డి, అశ్వర్థ నారాయణ, శ్రీనాథ్ చౌదరి, సర్పంచులు మంజు, జనార్ధన్, మంజు, తోపాటు భాష,సిద్దన్న, పుల్లప్ప, హనుమంత రాయుడు, ఉమాశంకర్ నల్లూరు నాగరాజు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు : ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర స్పష్టం చేశారు. మండలంలోని అల్లాపల్లి పంచాయతీ ఉగ్గిరెడ్డిపల్లిలో మంగళవారం నిర్వహించిన సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తో కలసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబుల్ రెడ్డి, ప్రాథమిక సహకార సొసైటీ అధ్యక్షులు తుమ్మల మహబూబ్ బాషా, బోయపల్లి శివారెడ్డి, జెరీపీటీ అంజినప్ప, నిజాం , మల్లాపల్లి ఓబుల్ రెడ్డి , జీవి ఆదినారాయణ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్టు

13 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

ప్రజాశక్తి-పెనుకొండ

ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న అంతర్‌రాష్ట్ర దొంగ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామని పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. మంగళవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దొంగ అరెస్టు వివరాలను వెల్లడించారు. రొద్దం మండలం శేషాపురం గ్రామానికి చెందిన బోయ రాజు ఉరఫ్ బోయనాగేంద్ర, పరిగి మండలం ఊటకూరు గ్రామానికి చెందిన సి.చిన్నపరెడ్డి ఉరఫ్ శ్రీనివాసరెడ్డి పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో పలు ఇళ్ళల్లో చోరీలకు పాల్పడినట్లు కేసులు నమోదు అయ్యాయన్నారు. ఈ కేసులను ఛేదించడానికి పెనుకొండ సిఐ రాఘవన్, పరిగి ఎస్ఐ రంగడు సిబ్బందితో స్పెషల్ టీం గా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం పరిగి మండలం గొల్లపల్లి క్రాస్ సమీపంలో బోయ రాజు ఉరఫ్ బోయనాగేంద్ర ను అరెస్టు చేసి రూ..10 లక్షలు విలువైన 13 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో నిందితుడు సి.చిన్నపరెడ్డి ఉరఫ్ శ్రీనివాసరెడ్డి ఇప్పటికే పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసులో వారెంట్ పైన అరెస్టు అయి జైలులో ఉన్నాడన్నారు. దొంగతనాలలో పాల్గొన్న నిందితుడు బోయరాజు ఉరఫ్ నాగేంద్ర పైన కర్నాటక రాష్ట్రం తుంకూర్ జిల్లా పావగడ పోలీసు స్టేషన్‌లో 12 చోరీ కేసులున్నాయని మరో నిందితుడు సి.చిన్నపరెడ్డి అలియాస్ శ్రీనివాసరెడ్డి పాత నేరస్తుడని చెప్పారు. ఇతనిపైన పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్, కర్నాటక రాష్ట్రం పావగడ, జి.కోడిగేపల్లి, బాగేపల్లి, అరిసెకెరే, గౌరీబీదనూరు పోలీసు స్టేషన్ ల్లో పలు దొంగతనం కేసులు ఉన్నాయని డీఎస్పీ వివరించారు. నిందితుల అరెస్టు బంగారు ఆభరణాలను రికవరీ చేయడంలో కీలక పాత్ర వహించిన పెనుకొండ సిఐ కె.రాఘవన్, పరిగి ఎస్ఐ రంగడు, ఏఎస్ఐ వెంకటేశులు, హెడ్ కానిస్టేబుల్ సునీల్ నాయక్, కానిస్టేబుల్ శివ, సురేశ్, రామంజి, ధను, నాగార్జునను ఎస్పీ వి రత్న ప్రత్యేకంగా అభినందించారు.

బ్యాంకు దోపిడీ నిందితులను పట్టుకుంటాం : ఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం పారిశ్రామిక వాడ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో దోపిడీకి పాల్పడిన నిందితులను త్వరలో పట్టుకుంటామని ఎస్పీ రత్న వెల్లడించారు. ఈ మేరకు ఆమె మంగళవారం దోపిడీ జరిగిన తూమకుంట పారిశ్రామిక వాడ ఎస్.బి.ఐ. శాఖను పరిశీలించారు. బ్యాంకు లోపల జరిగిన పరిణామాలపై బ్యాంకు మేనేజర్, ఇతర సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఘటనా స్థలంలో వేలిముద్రల నిపుణులు, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించిన తీరును పర్యవేక్షించారు. అలాగే బ్యాంకు లోపల, చుట్టుపక్కల అమర్చిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి, నిందితుల ఆచూకీ గుర్తించేందుకు సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. దర్యాప్తు పురోగతిపై మీడియాతో మాట్లాడిన ఎస్పీ రత్న దొంగలను వీలైనంత త్వరగా పట్టుకుని చట్టం ముందు నిలబెడతామని పేర్కొన్నారు. హిందూపురం రూరల్ ఎస్‌బిఐ బ్యాంకులో దాదాపు రూ.38 లక్షల నగదు, 11.40 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిసిందన్నారు. ఈ కేసును తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రత్యేక పోలీసు బృందాలు దర్యాప్తు ప్రారంభించాయన్నారు. ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె తెలిపారు. ఈ పరిశీలనలో డీఎస్పీ మహేష్, సిఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం ఉన్నారు.



బ్యాంకులో ఆధారాలు సేకరిస్తున్న ఎస్పీ, తదితరులు

పుట్టపర్తిలో స్థానికేతరుల భూములకు రక్షణ కరువు

ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధిత మహిళ

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో స్థానికేతరులకు, వారి భూములకు రక్షణ లేకుండా పోయిందని హైదరాబాద్ కి చెందిన సత్యసాయి భక్తురాలు గాయత్రి అనే మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పుట్టపర్తిలో ఆమె మీడియాతో మాట్లాడుతూ 2018 సంవత్సరంలో పుట్టపర్తి ఉజ్వల ఫౌండేషన్ సమీపంలో ఉన్న పొలం సర్వేనెంబర్ 356-1 లో 5 సెంట్లు విస్తీర్ణం గల 6వ నెంబర్ ఫ్లాట్ కొనుగోలు చేశానని చెప్పారు. అయితే ప్రస్తుతం ఆ ఫ్లాట్ ను స్థానికంగా ఉన్న రవీంద్ర, భారతి అనే వ్యక్తులు కబ్జా చేశారని ఆరోపించారు. కోర్టుకు వెళ్లి ఇంజక్షన్ ఆర్డర్ తీసుకొచ్చిన కూడా తనపై దాడులకు దిగి బెదిరిస్తున్నారని వాపోయారు. తమ నాన్న తరం నుంచి సత్యసాయి భక్తులుగా తాము ప్రతి ఏటా ఇక్కడకు వస్తున్నామన్నారు. ఓ పెద్ద ప్రముఖ కంపెనీలో ఉద్యోగ విరమణ చేసిన తాను ప్రస్తుతం ఇక్కడే నివాసం ఉండాలని ఇల్లు కట్టుకునేందుకు వచ్చి చూస్తే తన భూమి కబ్జాకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ కు ఫిర్యాదు చేశానన్నారు. వెంటనే స్పందించిన ఎస్పీ రత్న విచారణ జరిపి తనకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. పోలీసులు తక్షణమే స్పందించి పుట్టపర్తిలో స్థానికేతరులకు వారి భూములకు రక్షణ కల్పించాలని బాధితురాలు గాయత్రి కోరారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే జరిమానా

ప్రజాశక్తి - గోరంట్ల

ప్లాస్టిక్ కవర్లను ఎవరైనా వినియోగించినా, విక్రయించినా జరిమానా విధిస్తామని ఎంపిడిఒ నరేంద్రకుమార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండలంలోని బూదిలి గ్రామంలోగల దుకాణాలు, చికెన్ సెంటర్లు, హోటళ్లను తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వ్యాపారస్తులు దుకాణాలలో ప్లాస్టిక్ కవర్లు విక్రయించరాదన్నారు. వాడినా, విక్రయించినా రూ. 5వేల నుంచి 20వేల రూపాయల వరకు జరిమానా విధిస్తామన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ జైపాల్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి మడకశిర టౌన్

మడకశిర ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య, ఎఇఎస్ శ్రీరామ్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరిహద్దులో కర్నాటక మద్యం రాకుండా నిఘా పెంచాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో స్థానిక సిఐ మురళీ క్రిష్ణ , ఎస్ఐ శంకర్ ఉన్నారు.

సింగిల్‌విండో డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి - అగళి

మండలానికి సింగిల్ విండో డైరెక్టర్ శివప్పను టిడిపి స్థానిక నాయకులు మంగళవారం సన్మానించారు. సీనియర్ పాత్రికేయుడు అయిన శివప్ప 25 ఏళ్లుగా గా రాజకీయ రంగంలో కొనసాగుతున్నారు. ఆయన చేసిన సేవలను గుర్తించిన నాయకులు సింగిల్‌విండో డైరెక్టర్‌గా నియమించారు. ఈ నేపథ్యంలో ఆయనను స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల వద్ద 24 గంటల నిఘా ఉండాలి

మేనేజర్లకు నోటీసులు అందించిన పోలీసులు

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఇటీవల కాలంలో జరుగుతున్న బ్యాంకు దోపిడీలు, దొంగతనాలను దృష్టిలో ఉంచుకొని బ్యాంకుల వద్ద 24 గంటల నిఘా ఉండేలా సీసీ కెమెరాలు ఆన్ చేసి ఉంచాలని బత్తలపల్లి పోలీసులు బ్యాంక్ మేనేజర్లకు నోటీసులు అందజేశారు. మంగళవారం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్ ఆదేశాల మేరకు మండలం కేంద్రం లో ఉన్న స్టేట్ బ్యాంకు, గ్రామీణ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, బరోడా బ్యాంకు మేనేజర్లకు ఏఎస్ఐ సోమశేఖర్ మూర్తి నోటీసులు అందజేశారు.